

# అశ్వమేధయాగం

**- శ్రీశ్రీ**

''అమ్మకి ప్రాణంమీద కొచ్చింది. వెంటనే బయల్దేరురామం.'' తమ్ముడిచ్చిన టెలిగ్రాం చదువుకున్నాడు వెంకటేశ్వర్లు. ఒక్క క్షణం మట్టుకు మనసులోని ఊహలన్నీ స్తంభించి మెదడు శూన్యమయింది. కత్తివేటుకి చర్మం తెగితే వెంటనే రక్తం రాదు. రక్తం రావడం ప్రారంభించడంతో వరదగా ప్రవహిస్తుంది.

ఊహలు వరదలుగా ప్రవహిస్తున్నాయి. ''... అమ్మ చచ్చిపోతుంది కాబోలు. సాయంత్రం మెయిలులో బయల్దేరాలి. వెళ్ళేదాక ఉంటుందో ఉండదో రేపు వెళ్ళితే ముసలి ప్రాణం రేపటిదాకా నిలుస్తుందా అయినా ఇవాళ బయల్దేరడానికి వీలు లేదు. రేపు వెళ్ళవచ్చు. చచ్చిపోదు ఫరవాలేదు. రేపే వెళతాను. మరి డబ్బు''

తలకాయలో పందెపు గుర్రాలు పరుగెత్తుతున్నాయి.

డబ్బు సంగతి తలలో మెరిసిన వెంటనే ''ఈ టెలిగ్రాముతోనే డబ్బు పోగు చెయ్యవచ్చు'' ననే ఊహ పుట్టింది ఒకచోట కాదు.

పదిచోట్ల సొమ్ము చెయ్యవచ్చు. తల్లి చచ్చిపోతోందంటే డబ్బు బదులివ్వని కఠిన హృదయులుండరు. నలుగురైదుగురు బిర్ర బిగిసినా, ఐదారుగురైనా ఇచ్చి తీరుతారు. సుమారు నూరు రూపాయలు పడతాయనడానికి సందేహం లేదు.

వెంటనే బట్టలు వేసుకున్నాడు. దమ్మిడీ అయినా లేదు. దగ్గరలో ఉన్నవాడూ, అడగ్గానే అప్పు యిచ్చేవాడూ ఎవరని ఆలోచించాడు. మరెవరు సత్యనారాయణ ఉన్నాడు. నాలుగు వీధుల అవతల నడుచుకుపోవచ్చును. ఈ కష్ట సమయంలో పెళ్ళాం మెళ్ళో నగ తాకట్టు పెట్టి అయినా డబ్బు తెమ్మని అడగదగినంత చనువూ, అవకాశం ఉన్నాయి.

''సత్యనారాయణగారూ!''

''ఇంట్లో లేరండీ!''

ఏం అపశకునం! ఇంత పెందరాళే ఎక్కడికి వెళ్ళిపోయాడో అన్నట్టు టెలిగ్రాము గదిలో వదిలిపెట్టలేదు కద. జేబు తడుముకున్నాడు. ఉంది. జేబులోనే ఉంది.

మరి ఈ సత్యనారాయణ ఎక్కడ దొరుకుతాడు కాఫీ క్లబ్బులోనా తన జేబులో రెండణాలయినా ఉంటే బాగుండును. అబ్బే కాఫీ క్లబ్బుకి వెళ్ళడు. ''ఇంట్లో కనుక్కుంటా. చెప్పి వెళతాడా ఏమో అడిగి చూదాం.''

''సెంట్రలు స్టేషను కెళ్ళారండి. వచ్చాక మీరొచ్చినట్టు చెబుతాను.'' ఇంట్లో నుండి జవాబు. వీధి కొసని తనకి తెలిసిన సోడా దుకాణం నాయర్ దగ్గర ఒక పావలా తీసుకున్నాడు వెంకటేశ్వర్లు. బస్సులో పడ్డాడు. నిలబడే ప్రయాణం చేశాడు. గుర్రాలు మరీ జోరుగా పరుగెడుతున్నాయి మనస్సులో.

ప్లాటుఫారం మీద సత్యనారాయణని కలుసుకున్నాడు. ఇంకా మెయిలు రాలేదు. ''మా బావమరిది వొస్తున్నా''డని సత్యనారాయణ ప్రకటించాడు. ఎలా ప్రారంభిస్తే బాగుంటుంది ''మీ యింటికి వెళ్ళితే నువ్వు లేవు. అర్జంటు పని మీద వొచ్చాను.'' అంటే బడి కుర్రాడు పెన్సిలు గీతలు రబ్బరు పెట్టి తుడిచేసినట్లు మనస్సులోంచి ఆ మాటలను తుడిచి వేశాడు. ఏమీ అనకుండా జేబులోంచి వైరు తీసి సత్యనారాయణ కిచ్చాడు.

''అరే, పాపం! మీ అమ్మకి జబ్బుగా ఉన్నట్లు కూడా వినలేదే!''


''వృద్ధాప్యమే జబ్బు, బతకదు. లాభం లేదు. సాయంత్రం మెయిలుకి పోదామనుకుంటున్నాను.'' సత్యనారాయణ చూపులు శూన్యాన్ని చిన్న చిన్న పీలికలుగా తుంచుతున్నాయి. ''వెడదామంటే డబ్బు లేదు...'' ఎవ్వరో నూతిలో పడిపోయినట్టు ఈ మాటలన్నాడు వెంకటేశ్వర్లు తొందరగా. సత్యనారాయణ కుడి చేతి బొటన వ్రేలినీ, చూపుడు వ్రేలినీ చాచి నుదుటిని పట్టుకుని ''పాతిక రూపాయలయినా ఉండాలనుకుంటాను'' అన్నాడు.


''ముప్ఫై రూపాయలు కావాలి. నువ్వే ఇవ్వాలి. ఎంత ముంచుకొచ్చినా ఎవరినీ నోరు విడిచి అడగలేను.''

సత్యనారాయణది త్వరగా కరిగిపోయే గుండె. నగ తాకట్టుపెట్టి ఇస్తానని పించడానికి వెంకటేశ్వర్లుకి ఐదు నిమిషాల కంటె ఎక్కువ పట్టలేదు. మధ్యాహ్నం రెండు గంటలకి మీ ఆఫీసులో కలుసుకుని సొమ్ము తీసుకుంటానని చెప్పి వెళ్ళిపోయాడు వెంకటేశ్వర్లు.

## ఏమనందు గోపీచందూ!

**1952** ప్రాంతంలో గోపీ చంద్ దర్శకత్వంలో ''పేరం టాలు'' సినిమా విడుదల అయింది. అందులో నాలుగైదు చావులు వున్నాయి. విడుదలకు ముందు అభిప్రాయం తెలుసుకో గోరి శ్రీశ్రీకి ఆ చిత్రాన్ని చూపారు. చిత్రం పూర్తికాగానే ఆశువుగా ఓ కందం అందుకున్నారు శ్రీశ్రీ!






మహాకవి శ్రీశ్రీ శ్లేషలు ఎన్నిసార్లు చెప్పుకున్నా బాగానే వుంటాయి. రైల్వే స్టేషన్ లో కనిపించిన మొక్కపాటి వారు ''ఊరికేనా'' అని అడిగితే ''అవును, ఊరికే'' అని శ్రీశ్రీ జవాబు.

ఒకసారి మిట్ట మధ్యాహ్నం వేళ ఒక పత్రికా కార్యాలయానికి వెళ్ళారు శ్రీశ్రీ. అక్కడ కవరు పేజీ ఏమి చెయ్యాలో తోచక ఆ పత్రికా సంపాదకుడు తల మునకలు అవుతున్నాడు. ''కొచ్చిన్ సిస్టర్స్ వేద్దామా వద్దా అని ఆలోచిస్తున్నాను బ్రదరో'' అన్నాడు శ్రీశ్రీతో. ఆ టాపిక్‌ను పక్కకు నెట్టేస్తూ ''ఎందుకొచ్చిన్ సిస్టర్స్ భోజనానికి వెళ్దాం పద'' అంటూ బయటకు నడిపించారు శ్రీశ్రీ.

పానగల్ పార్కులో రికామీగా కూర్చున్న శ్రీశ్రీని సుప్రసిద్ధ రంగస్థల నటుడు శ్రీ వల్లం నరసింహారావు ఓ నాటిక రాయమని అడిగితే ''ఏనాటికైనా రాస్తాను మిత్రమా'' అని అభయం యిచ్చారు శ్రీశ్రీ.

***

నరహరి సెట్టి దగ్గర పది రూపాయలు సంపాదించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది.

టాక్సీ చేయించుకొని మైలాపూరు బ్యాంకుకి వెళ్ళాడు వెంకటేశ్వర్లు. బ్యాంకు గుమాస్తా కామేశం స్నేహితుడు కాడు గాని పరిచయస్థుడు. ఇలాంటి సన్నివేశాలలో స్నేహం కన్న పరిచయమే డబ్బు పలికిస్తుంది.

బ్యాంకులో అరగంట వ్యర్థమై పోయింది. దమ్మిడీ కూడా మిగలలేదు. టాక్సీని పంపించివేశాడు. అనవసరంగా డబ్బు వేటకి ఎక్కువ పెట్టుబడి పెట్ట కూడదని నిశ్చయించాడు.

ఇద్దరు ముగ్గురు వకీలు స్నేహితుల ఇండ్లకు నడుచుకుంటూ వెళ్ళాడు. టెలిగ్రామ్ చూపించి ఒకచోట ఇరవై ఇంకొక చోట ఇరవై ఐదూ పిండుకున్నాడు.

***

మధ్యాహ్నం పండ్రెండు గంటలకి జేబులో డెబ్బయి అయిదు రూపాయల జమ.

గుర్రాలు జోరుజోరుగా పరుగెత్తుతున్నాయి. సత్యనారాయణ ఇచ్చే ముప్పైయి రూపాయలూ కలుపుకుని నూట ఐదు రూపాయలవుతాయి. ఇవాళ గిండీకి వెళ్లిపోతాను. గుర్రపు పందాల ఆఖరి రోజు. చీకటితోనే ఎక్స్‌ప్రెస్ ఎక్కేస్తాను.

''రెండు మూడు వందలైనా గెలవకపోతానా'' అనుకున్నాడు వెంకటేశ్వర్లు. నిన్న సాయంత్రం కొన్న 'రేసింగ్‌గైడు' కోటు లోపలి జేబులోంచి పైకి తీశాడు. సైంటిఫిక్‌గా ఆలోచించి గుర్తులు పెట్టుకున్న గుర్రాల పేర్లు మరోమారు మననం చేసుకున్నాడు. ఇవాళ నువ్వు గెలిచి తీరుతావని ఎవరో రక్తంలోంచి సందేశాలు పంపుతున్నట్లనిపించింది.

''మరి ఇంటికి వెళ్ళను. భోంచెయ్యాలని లేదు. టిఫిన్ తీసుకుని సత్యనారాయణ ఆఫీసుకీ, అక్కణ్నుంచే పార్కు స్టేషనుకీ.''

ఎలక్ట్రిక్ ట్రెయిన్‌లో కూర్చున్నాడు. ట్రెబిల్ ఈవెంట్‌లో ఏడెనిమిది వందలొస్తే ఇవాళ చేసిన అప్పులన్నీ ఈ సాయంత్రమే తీర్చేస్తాను. కిందటి రేస్‌లో ఈ నెల జీతమంతా తగలేశాను. అనుకున్న గుర్రాలని ఆడకుండా ఎవరో చెప్పిన మాట వింటే ఏమవుతుంది మరి

''ఇవాళ ఫరవాలేదు. కళ్ళు మూసుకొని ఆడేస్తాను. పుట్టమీద పెట్టినట్టు డబ్బొచ్చేస్తుంది. ఫూల్‌ప్రూఫ్‌గా ఆలోచించాను. సైంటిఫిక్‌గా అంచనా వేశాను. ఇవాళ నేను ఓడిపోవడానికి వీలు లేదు.''

***

వెంకటేశ్వర్లు సాయంత్రం గిండీ నించి మరలి వస్తున్నప్పుడు అతని జేబులో తొమ్మిదణాల చిల్లర డబ్బులు, రెండు సిగరెట్లున్న విల్సు పాకెట్టు, ఉదయం అందిన టెలిగ్రాము మాత్రం మిగిలాయి. అతనెంత సైంటిఫిక్‌గా ఆలోచించగలిగినవాడైనా గుర్రాలకి ఆ సబబు లేవీ తెలియకపోవడమే అతని పరాజయానికి కారణం.

## శ్రీశ్రీ హాస్య క్రీడలు

''ఇప్పుడు తెలుగుదేశంలో నా పాటి రాసేవాళ్ళు ఎవరూ లేరని నేను అనుకుంటున్నాను'' అని స్తోత్కర్షప్రారంభించిన మిత్రుని మాటలకు శ్రీశ్రీ ''నేనూ అదే అనుకుంటున్నాను'' అన్నారట తల పంకిస్తూ.

ఒకసారి మద్రాసులో ట్రాం బండిలో వెడుతుండగా గోరా శాస్త్రి గారు ''ఈ క్షణాన ఎవ్వరైనా రెండు వందలు అప్పిస్తే బాగుండు'' అన్నారట. వెంటనే శ్రీశ్రీ ''నాకు అంత అక్కర్లేదు'' అన్నారట బెట్టుసరిగా.

కొన్నాళ్ళ క్రితం శ్రీశ్రీ ద్వంద్వ వైఖరి పట్ల అసంతృప్తిని వ్యక్తం చేసిన మిత్రులకు అజంతా జవాబు: ''శ్రీశ్రీని ఏమీ అనకండి. ఆయన జ్వరం తగిలిన దేముడు.''

